నొక సాధనగా ఉపయోగించుకొనెను. దానితో ప్రజలలో విమర్శనము, అసంతృప్తి, అల్లకల్లోలము బయలుదేరెను; చెలరేగెను.

ఈ నాడు మనము లౌకిక రాజ్యాంగమును గురించి తర్కించుకొనుచున్నారము. ఆ రాజ్యాంగ స్థాపనకొఱకే ప్రయత్నించుచున్నాము. దీనిని మనము నూతన మని యనుకొన నక్కఱలేదు. ప్రాచీనకాలమునుండి మనమిట్టి రాజ్యాంగమునకు అలవాటుపడినవారమే. ఏ ప్రాచీన భారతీయ సామ్రాజ్యము తీసికొన్నను మతాతీత రాజ్యాంగమున కుదాహరణమే, ఆదర్శమే, ధ్రువతారయే. ఇట్టి 'ప్రాత క్రొత్తయగుటకూడ నొక వింతయే'. ఈ మతవిముక్త రాజ్యాంగమును ధ్రువతారగా నిల్పుకొని అశోకుని కొఱకు ప్రాకులాడుట గణపతిని జేయబోయి, గజముఖాసురుని చేయుట వంటిది. ఈ ప్రయత్నము ఏ విధముగా ఫలించునో విచారింతముగాక. దీనికొఱ కొకసారి మనము సుప్రసిద్ధ చరిత్రకారులైన రాయచౌదరి, మజుందార్, దత్త వ్రాసిన "ఎడ్వాన్స్ హిస్టరీ ఆఫ్ ఇండియా" అను గ్రంథమును పరికించిన విదితము కాగలదు.

అశోకసామ్రాజ్యమును గురించి విమర్శించుచు వారిలా వ్రాసిరి. "రాజ్యాధికారులను మతప్రచారకులుగా చక్రవర్తి మార్చివైచెను. ఆయుధములు, ఆయుధ కర్మాగారములు, అన్నింటినీ బహిష్కరించెను. మతప్రచారమే ప్రధానమాయెను. మతమును గురించిన వాదోపవాదములే యెచ్చట చూచినను వినబడుచుండెను కాని, రణభేరీలు మ్రోగుట మానెను. అతని విపక్ష పక్షము వారు అశోకసామ్రాజ్యము నొక కంటితో కనిపెట్టియుండిరి. అతడు మరణించిన కొద్ది సంవత్సరములకే శాలంకుల నప్రతిహతముగా తరిమిన సేనాబలము, బాక్ట్రియా రాజులనుండి దేశమును సంరక్షించలేకపోయినది-' ఇదీ అశోకరాజ్యాంగ నీతి. భావి భారత పౌరులమైన మనము మన భవిష్యత్తును రూపొందించవలసిన వారము. దీన్నే మన మాదర్శంగా తీసుకుంటే లక్ష్యాన్నుంచి పతితులమౌతాము. కాబట్టి, మనకు లక్ష్యసిద్ధి కావాలంటే లక్ష్య శుద్ధి అవసరం.

# తెలుగు తల్లి

శ్రీ శ్రీ

అదెవో తెలుగుతల్లి
అందాల సింధు జాబిల్లి
ఆనందాల కల్పవల్లి
అదె నీ తెలుగుతల్లి

పదవోయ్ తెలుగువాడా
అదె నీ తెలుగు మేడ
సంకెళ్లు లేని నేల
సంతోష చంద్రశాల

కనవోయ్ తెనుంగు రేడా
అదె నీ అనుంగు నేల
అదిగో సుదూర వేల
చనవోయ్ తెలుగు వీరా

స్వర్గాల కాంతి స్వప్నాలు
స్వప్నాల శాంతి స్వర్గాలు
నిన్నే పిలుస్తున్నాయి
నిన్నే వరిస్తున్నాయి

ఆందోళనాల డోల
సందేహాల హిందోళ
ఎందాక ఊగిసలాట
ఇదె నీ గులాబితోట

పదవోయ్ తెలుగుబాట
ఇదిగో తెలుగుకోట
పదవోయ్ నిర్భయంగా
పదవోయ్ దిగ్జయంగా
పదవోయ్ నిశ్చయంగా

(డిసెంబరు ఒకటి నాడు విజయవాడ రేడియోకోసం)